

హోరాహోరీగా ఎస్పీఎల్

సాక్షి ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ క్రికెట్ మ్యాచ్‌లు తుదిదశకు చేరుకున్నాయి. గురువారం నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి. - 8లో



భానుకోట క్షేత్రంలో నేడు నూతన ఆలయాల ప్రారంభం

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీభాను కోటేశ్వరస్వామి క్షేత్రంలో నూతన ఆలయాలను ప్రారంభించనున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
32.4/15.7

వాతావరణం

జిల్లాలో గురువారం 15.7 - 32.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

కులాలు చూడం.. మతాలు చూడం.. ప్రాంతాలు చూడం.. వర్గాలు చూడం.. చివరకు రాజకీయాలు చూడం.. పార్టీలు కూడా చూడకుండా ప్రతి ఒక్కరికీ మంచి చేసే ప్రభుత్వం మనది అని చెప్పడానికి గర్వపడుతున్నా.. ఇవి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి బహిరంగ సభలోనూ చెప్పే మాటలు.. అవును.. ఈ మాటలు అక్షర సత్యాలని నిరూపిస్తున్నాయి రాష్ట్రంలోని పరిస్థితులు.. ఒక్క వైఎస్సార్ జిల్లానే తీసుకుంటే ఇక్కడి ప్రతి నియోజకవర్గంలోనూ తెలుగుదేశం పార్టీ నాయకుల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరింది. అమ్మఒడి మొదలుకుని రైతు భరోసా వరకు.. అనేక సంక్షేమ ఫలాలను వారు అనుభవిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి.




- వైఎస్ జగన్ సర్కార్‌లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- కులాలు లేవు.. మతాల్లేవ్.. రాజకీయాల్లేవ్...అర్హతే ప్రామాణికం
- బద్వేల్ టీడీపీ కౌన్సిలర్ కుటుంబానికి రూ.11.6లక్షలు లబ్ధి
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బహిర్గతమవుతున్న వైనం
- నాడు జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సులకే ఫించన్లు
- జిల్లా వ్యాప్తంగా మూడేళ్ల లో అర్హులకు రూ.5,997.74 కోట్లు పంపిణీ

పచ్చని బతుకులు

సాక్షి ప్రతినిధి, కడప: ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన రోజున వర్గాలను చూడం, పార్టీలను చూడం, రాజకీయాలకతీతంగా ప్రభుత్వ ఫలాలు అందిస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ మేరకు అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అర్హుల ఇంటికి చేరుతున్నాయి. తర, తమ, భేదం లేకుండా ఆయా పథకాలకు అర్హులైతే గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధి చేకూరుతోంది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సు ఉన్నోళ్లకే ప్రభుత్వ పథకాలు అందేవి. నాటి పరిస్థితులను ప్రస్తుతం పూర్తిగా తిరగరాశారు. అందుకు తార్కారణమే టీడీపీ నేతల కుటుంబానికి చేకూరిన లబ్ధి. జిల్లా వ్యాప్తంగా టీడీపీ క్రియాశీలక నేతలందరికీ వైఎస్ జగన్ సర్కార్ సంక్షేమ ఫలాలు దక్కాయి. సామాన్య కార్యకర్త నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న నేతల వరకూ అర్హుల జాబితాలో ఉండడం విశేషం.

జిల్లా వ్యాప్తంగా రూ.5,997.74 కోట్లు లబ్ధి

గడిచిన మూడేళ్లలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా రూ.5,997.74 కోట్లు నేరుగా లబ్ధి చేకూర్చింది. అందులో వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా వివిధ ఫించన్లు 2,49,868 మంది లబ్ధిదారులకు రూ.2,287.58 కోట్లు దక్కింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా 2,22,041 మందికి వివిధ చికిత్సల నిమిత్తం రూ.478.17 కోట్లు వెచ్చించారు. అలాగే వైఎస్సార్ రైతు భరోసా ద్వారా నాలుగు విడతలుగా జిల్లాలోని రైతుల ఖాతాలకు రూ.1,022.06 కోట్లు జమ చేశారు. వైఎస్సార్ చేయూత ద్వారా అక్కచెల్లెమ్మలకు రూరల్‌లో రూ.467.85 కోట్లు, అర్బన్‌లో రూ.149.59 కోట్లు దక్కింది. జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా రూ.244.06 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాలకు చేరింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ అర్హతే ఏకైక ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తోంది.



టీడీపీ సర్పంచ్‌కు అక్షరాలా రూ.2,13,256 లు లబ్ధి



టీడీపీ సర్పంచ్ ప్రభావతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు (ఫైల్)

రాజుపాళెం మండలం అర్కటవేముల గ్రామ పంచాయతీ టీడీపీ సర్పంచ్ ఎత్తపు ప్రభావతి కుటుంబానికి గత మూడేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2,13,256 లబ్ధి చేకూరింది. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించినప్పుడు సర్పంచ్ కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు.

సర్పంచ్ కుటుంబానికి చేకూరిన లబ్ధి

ఇన్‌పుట్ సబ్సిడీ	- రూ.46,215
వైఎస్సార్ పెన్షన్ కానుక	- రూ.65,000
వైఎస్సార్ సున్నా వడ్డీ	- రూ.3,210
వైఎస్సార్ ఆసారా	- రూ.23,442
వైఎస్సార్ సున్నా వడ్డీ	- రూ.7,913
వైఎస్సార్ రైతు భరోసా	- రూ.67,500

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన నగదు వివరాలు.. (రూ.కోట్లలో)

సంవత్సరం	లబ్ధిదారులు	అందజేసిన మొత్తం
రైతు భరోసా		
2019–20	206708	279.93
2020–21	208747	280.06
2021–22	199344	269.11
2022–23	198074	192.96
మొత్తం	8,12,873	1,022.06
సున్నా వడ్డీ పంట రుణాలు		
	185303	39.14
జగనన్న అమ్మ ఒడి		
	187742	244.06
జగనన్న విద్యా కానుక		
2020–21	177318	27.13
2021–22	183364	30.61
2023–23	181001	36.20
మొత్తం	5,41,683	93.94
జగనన్న వసతి దీవెన		
	50575	46.04
జగనన్న విద్యా దీవెన		
మొదటి విడత	51902	29.61
రెండవ విడత	51798	34.52
మూడవ విడత	52491	34.08
నాల్గవ విడత	52261	33.85
మొత్తం	2,08,452	131.96
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ		
2019–20	35394	90.97
2020–21	43512	102.10
2021–22	73064	147.03
2022–23	70071	138.07
మొత్తం	2,22,041	478.17
వైఎస్సార్ పెన్షన్ కానుక		
	249868	2287.58
జగనన్న తోడు		
మొదటి విడత	17446	17.41
రెండవ విడత	17264	17.26
మూడవ విడత	16659	16,65
నాల్గవ విడత	9202	9.20
ఐదవ విడత	19620	31.73
మొత్తం	80,191	92.25
జగనన్న చేదోడు		
మొదటి విడత	14007	14.00
రెండవ విడత	14046	14.04
మొత్తం	55,053	28.04

టీడీపీ కౌన్సిలర్ కుటుంబానికి...

సోమేశుల సుధామణి బద్వేల్ మున్సిపాలిటీలో 6వవార్డు టీడీపీ కౌన్సిలర్. తెలుగుదేశం పార్టీకి చెందిన ఆమె కుటుంబ సభ్యులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మూడేళ్లలో రూ.11,60,440 నగదు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. ఉమ్మడి కుటుంబం కావడంతో తోడికోడలు సోమేశుల సుభాషిణికి రూ.9,04,924, స్వతహాగా కౌన్సిలర్ సుధామణికి రూ.78,994, కోడలు సోమేశుల సావిత్రికి రూ.1,50,598, మరో తోడికోడలు సోమేశుల సుబ్బరత్నమ్మకు రూ.25,924 లబ్ధి చేకూరింది. కౌన్సిలర్ కుటుంబానికి లభించిన సంక్షేమ పథకాల వివరాలను తాజాగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎస్. సుధా కుటుంబ సభ్యులకు అందించారు.

తెలుగు యువత మాజీ మండల అధ్యక్షుడి కుటుంబానికి రూ.3.56 లక్షల లబ్ధి

చాపాడు మండలంలోని సీతారామాపురం గ్రామానికి చెందిన టీడీపీ తెలుగు యువత మాజీ మండల అధ్యక్షుడు మార్తల నరసింహారెడ్డి కుటుంబానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మూడేళ్ల కాలంలో రూ.3,56,476లు లబ్ధి చేకూరింది. నరసింహారెడ్డికి క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.1,68,910, ఇన్‌పుట్ సబ్సిడీ రూ.27వేలు, ఆయన సతీమణి రమాదేవికి క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.97,210లు, ఇన్‌పుట్ సబ్సిడీ రూ.17,280లు, కుమారుడు తరణి కృష్ణన్‌కు క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.30,707లు, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రూ.15,360లు వర్తించింది.



జగనన్న సంక్షేమ క్యాలెండర్

టీడీపీ ఇన్‌చార్జి కుటుంబానికి మేలు

ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని మంజూరు చేసింది. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆయన కుటుంబం వరుసగా రైతు భరోసా ద్వారా లబ్ధి పొందుతోంది. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తండ్రి గండ్లూరి ప్రతాప్‌రెడ్డికి కమలాపురం మండలం కోగటం గ్రామ పరిధిలో పంట పొలాలు ఉన్నాయి. టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సతీమణి మౌనికా రెడ్డి, సోదరులు వీరప్రదీప్‌కుమార్‌రెడ్డి, వీరారెడ్డి, తండ్రి గండ్లూరి ప్రతాప్‌రెడ్డి, తల్లి పద్మావతమ్మలకు 2021లో కమలాపురం మండలంలో సబ్సిడీ శనగలు మంజూరయ్యాయి.



రైతు భరోసా మంజూరైన పత్రం

న్యూస్‌రీల్

94.87 శాతం పింఛన్ల పంపిణీ

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ల పంపిణీ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఆయా ప్రాంతాల్లోని వలంటీర్‌లు అర్హులైన పింఛన్‌దారుల ఇంటింటికీ వెళ్లి నగదును అందజేస్తున్నారు. రెండో రోజైన గురువారం సాయంత్రం 4.22 గంటల సమయానికి వలంటీర్‌లు మొత్తం 2,42,751 మందికి రూ. 67,00,31,000 నగదును అందజేశారు. దీంతో పింఛన్ల పంపిణీ 94.87 శాతం నమోదైంది.

'హరిప్రియ' బెల్గాం వరకే

కడప కోటిరెడ్డిసర్కిల్ : తిరుపతి–కొల్హాపూర్, కొల్హాపూర్–తిరుపతి (17415/16) మధ్య నడుస్తున్న రైలు బెల్గాం వరకే నడపనున్నట్లు రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష తెలిపారు. ఈ రైలు ఈనెల 2వ తేది నుంచి 12వ తేది వరకు తిరుపతి–బెల్గాం మధ్య నడుస్తుందన్నారు. అలాగే 3 నుంచి 13వ తేదీ వరకు బెల్గాం–తిరుపతి మధ్య ఈ రైలు నడుస్తుందని వివరించారు. ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో ఈ మార్పు చేశారన్నారు.

ఆన్‌లైన్‌లో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల హాల్‌టికెట్లు

కడప ఎడ్యుకేషన్: జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్‌ఎంఎంఎస్)కు సంబంధించి విద్యార్థుల హాల్‌టికెట్స్ బిఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నందు స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. కాగా, ఎన్‌ఎంఎంఎస్ పరీక్షను ఫిబ్రవరి 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నామన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రతి రవాణా వాహనాలకు సకాలంలో పన్నులు చెల్లించాలని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఇ.మీరా ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలను ప్రత్యేక బృందాలతో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 36 మండలాలను ఏడు రూట్లుగా విభజించి మూడు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి ప్రతి రోజు తనిఖీ చేసేలా కార్యాచరణ రూపొందించామన్నారు.

చిరుధాన్యాల సాగును పెంచండి

కడప అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయం ద్వారా చిరుధాన్యాల సాగును ముందుకు తీసుకెళ్లాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామక్రిష్ణంరాజు సూచించారు. కడప ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో గురువారం సిబ్బందికి సాగుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా చిరుధాన్యాలను ప్రకృతి వ్యవసాయంలో పండించి అధిక ధరని పొందేలా ప్రోత్సహించాలన్నారు.

సురక్షిత ప్రయాణమే లక్ష్యం



సత్కారం పొందిన డ్రైవర్లతో అధికారులు

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో అడిషనల్ ఎస్పీ, డీటీసీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణారావు, జిల్లా రవాణా శాఖాధికారి మీరా ప్రసాద్‌లు తెలిపారు. గురువారం సాయంత్రం కడప జోనల్ కాన్ఫరెన్స్ హాలులో 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల కార్యక్రమాన్ని ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడంలో ఆర్టీసీకి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది మద్యపానం, ధూమపానం తదితర వ్యసనాలకు బానిసలు కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. గ్యారేజీ సిబ్బంది కండీషన్‌గల బస్సులను డ్రైవర్లకు అందించాలన్నారు. కొంతమంది డ్రైవర్లు బస్సులను ఎక్కడపడితే అక్కడ నిలిపి వేస్తున్నారన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారన్నారు. కార్పొరేషన్ మనుగడను దృష్టిలో పెట్టుకుని సంస్థకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. డ్రైవర్లకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని, మరి ఎందుకు ప్రమాదాలు చేస్తున్నారో గమనించాలన్నారు. ఇప్పటికైనా డ్రైవర్లు ప్రమాదాల నివారణకు కృషి చేస్తూ నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. కడప జోన్ ఈడీ గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న వాహన డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపినప్పుడు ఆర్టీసీ డ్రైవర్ రక్షణాత్మకంగా డ్రైవింగ్ చేయాలన్నారు. ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని 40 ఏళ్లు దాటిన వారికి కంటిచూపు, గుండె సంబంధిత సమస్యలపై ఆర్టీసీ వైద్యునితో స్క్రీనింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్క ప్రమాదం చేయని డ్రైవర్లు ఉన్నారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ప్రమాదాల రహిత రీజియన్‌గా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం తన సర్వీసులో ఇంతవరకు ప్రమాదం చేయని కర్నూలు జిల్లా ఆత్మకూరు డిపోకు చెందిన ఏఎం బాషా కుటుంబ సభ్యులతోపాటు కడప రీజియన్ పరిధిలో 24 మంది డ్రైవర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ పి.లక్ష్మిభాస్కర్, పీఓ రవి, డిపో మేనేజర్లు శ్రీనివాసులు, మల్లికార్జునరెడ్డి, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, ఢిల్లీశ్వర్‌రావు, వర్క్స్ మేనేజర్ అజంతుల్లా, స్టోర్స్ కంట్రోలర్ హరినాథ్, సీఐలు మహేశ్వర్‌రెడ్డి, శ్రీలత, గోవర్ధన్‌రెడ్డి, వివిధ డిపోల అధికారులు, యూనియన్ నాయకుడు బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కడప ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో కడప ఏసీబీ డీఎస్పీ పి. కంజాక్షన్ ఆధ్వర్యంలో సీఐలు యల్లంరాజు, కృష్ణమోహన్, ఎస్.మహమ్మద్ అలీ, ఎస్ఐలు వై.నరేష్, ఎస్.నౌషాద్‌అలి బాషాతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ఏసీబీ అధికారులు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సిబ్బందిని విచారించి రికార్డులను తనిఖీ చేశారు. ముఖ్యంగా 14400 నంబర్‌కు స్పందనలో వచ్చిన కొన్ని దరఖాస్తులపై తనిఖీలకు వచ్చినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన అవకతవకలపై చర్యల నిమిత్తం నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు.

లంచం డిమాండ్ చేస్తే 14400 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్‌చేయండి

సామాన్య ప్రజలు వివిధ సందర్భాలలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినప్పుడు ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే 14400 టోల్‌ఫ్రీ నంబరుకు స్పందనలో కానీ లేదా కడప ఏసీబీ డీఎస్పీ సెల్ నంబర్ 9440446191కు కాల్ చేయవచ్చని ఏసీబీ డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. అంతేకాకుండా కడప ఏసీబీ ల్యాండ్‌లైన్ 08562–243708 నంబరుకు కానీ, లేదా స్వయంగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు.



తనిఖీలో భాగంగా ఎర్రగుంట్ల తహసీల్దార్ నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ కంజాక్షన్

విదేశీ విద్యా వరం



- పేద విద్యార్థులకు.. విదేశాల్లో ఉన్నత విద్య
- జిల్లాలో 12 మంది విద్యార్థులు అర్హులు
- ఒకరికి ఏడాదికి రూ.70 లక్షల వరకు చెల్లింపు
- నాలుగు విడతలుగా ఫీజులు మంజూరు
- నేడు జగనన్న విదేశీ విద్యా దీవెన మొదటి విడత నిధులు మంజూరు


కడప రూరల్: పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం విప్లవాత్మమైన మార్పులు చేపట్టింది. అందులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విదేశీ విద్యా దీవెనను ప్రారంభించారు. ఈ పథకం ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యకు అవకాశం కల్పించారు. దీంతో ప్రతిభావంతులైన విద్యార్థుల కల సాకారమవుతోంది..

ప్రపంచంలోని 200 యూనివర్సిటీల్లో అవకాశం..

ప్రభుత్వం 2022–2023 విద్యా సంవత్సరం నుంచి జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు విద్యార్థులకు వైద్య విద్యతో పాటు ఎంఎస్సీ, ఎంటెక్ తదితర ఉన్నత విద్యను అభ్యసించడానికి అవకాశం కల్పించింది. ఈ విద్య పొందడానికి ప్రపంచంలో గుర్తింపు పొందిన ప్రముఖమైన 200 యూనివర్సిటీల్లో అవకాశం కల్పించింది.

నిబంధనలు ఇలా..: ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాకు చెందిన విద్యార్థులు వారికి ఇష్టమైన యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొంది ఉండాలి. తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ. 8 లక్షల లోపు కలిగిన విద్యార్థులు జగనన్న విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తు చేసుకోవాలి. అలా వచ్చిన దరఖాస్తులను విజయవాడలో అత్యున్నత అధికారులతో కూడిన కమిటీ సభ్యులు పరిశీలిస్తారు. నిబంధనల ప్రకారం అర్హులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి ప్రభుత్వం ఒక ఏడాదికి ఒక విద్యార్థికి రూ.70 లక్షల వరకు ఫీజులకు నిధులను మంజూరు చేస్తుంది. అంటే ఒక ఏడాదికి నాలుగు విడతలుగా ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంది. కాగా ఈ పథకానికి జిల్లా నుంచి మొత్తం 32 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో కాపు వర్గానికి చెందిన వారు ఏడుగురు, ముగ్గురు ఈబీసీ, ఒకరు మైనార్టీ, ఒకరు ఎస్సీ మొత్తం 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం మొదటి విడతగా నిధులను విడుదల చేస్తున్నారు.

పేద విద్యార్థులకు మంచి అవకాశం



ప్రభుత్వం పేద విద్యార్థుల విదేశీ విద్యకు మంచి అవకాశం కల్పించింది. ఈ పథకం ద్వారా అర్హులైన విద్యార్థులు విదేశాల్లో విద్యను అభ్యసించవచ్చు. లబ్ధిపొందుతున్న వారు విద్యలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలి. – జయప్రకాష్, జాయింట్ డైరెక్టర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ

రైతులకు జాప్యం లేకుండా విద్యుత్ సర్వీసులు

- జగనన్న కాలనీల్లో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ మీటర్లు బిగించాలి
- ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను తగ్గించాలి
- ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు

కడప కార్పొరేషన్: కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు దరఖాస్తు చేసుకునే రైతులకు జాప్యం లేకుండా సర్వీసులు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రావు ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో పూర్తయిన ఇళ్లకు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ మీటర్లు బిగించి విద్యుత్ సరఫరా చేయాలన్నారు. రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే విద్యుత్ సర్వీసులు ఇవ్వాలన్నారు. విద్యుద్దీకరణకు అవసరమైన మెటీరియల్స్ సిద్ధంగా ఉన్నాయని, పనులు త్వరగా చేయాలన్నారు. ఉద్యోగులు తమ పనితీరును మెరుగు పరుచుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగుల్లో మార్పు కోసం అనేక అవకాశాలిచ్చామని, ఇప్పటికీ మారని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఒకసారి చర్యలు తీసుకుంటే వెనక్కి తీసుకునేది ఉండదన్నారు. ప్రమాణాల ప్రకారం వినియోగదారులకు విద్యుత్ సేవలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులు తిరిగి వినియోగదారులకు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలను తగ్గించాలని, పనులలో నాణ్యతా ప్రమాణాలను విధిగా పాటించాలని అధికారులకు సూచించారు. సంస్థ ఆర్థిక పరిస్థితి మెరుగు పరిచేందుకు కింది స్థాయి నుంచి పై స్థాయి వరకూ ప్రతి ఉద్యోగి కష్టపడి పనిచేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేయాలన్నారు. విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా చూసుకోవాలన్నారు. వినియోగదారుడు తమ విద్యుత్ సమస్యలపై ఫోన్ చేస్తే కింది స్థాయిలో ఉన్న సిబ్బంది, అధికారులు తప్పనిసరిగా స్పందించాలన్నారు. విద్యుత్ శాఖ నుంచి అందించే సేవలు సంతృప్తికర స్థాయిలో ఉండాలన్నారు. విద్యుత్ బకాయిలు అధికంగా ఉన్నాయని, వాటిని వసూలు చేయడంపై దృష్టి సారించాలన్నారు. విద్యుత్ మరమ్మతులపై ముందస్తుగా పనులు చేసి వినియోగదారులకు అంతరాయాలు లేని నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ మునిశంకరయ్య, ఓఎస్‌డీ శ్రీనివాసులు, చీఫ్ జనరల్ మేనేజర్ ధర్మజ్ఞాని, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జె. చెన్న రాఘవులు, ఈఈలు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

ఒంటిమిట్ట : ఏకశిలా నగరి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం అధికారులకు సూచించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గల తన చాంబర్‌లో గురువారం సాయంత్రం ఆయన ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోదండరామస్వామి కల్యాణానికి అవసరమైన తలంబ్రాల తయారీని ఎప్పుడు ప్రారంభించాలనే అంశంపై అధికారులతో చర్చించారు. స్వామి వారి కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారని, వారికి అన్నప్రసాదాల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎండా వేడిమి నుంచి ఉపశమనం కలిగించడానికి విరివిగా మజ్జిగ, తాగునీరు పంపిణీ చేయడానికి అవసరమైన కౌంటర్లు సిద్ధం చేయాలన్నారు. మార్చి 30వ తేదీ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని, 31వ తేదీ ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరును బ్యాడ్మింటన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం జార్జికారొనేషన్ క్లబ్‌లో రాష్ట్ర స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో గతంలో అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించామని తెలిపారు. జార్జిక్లబ్ కార్యదర్శి గంగిరెడ్డి మాట్లాడుతూ ఈ పోటీల్లో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొంటున్నందున యువ క్రీడాకారులు వారి నుంచి స్ఫూర్తిని పొందాలని తెలిపారు. 35 ఏళ్ల నుంచి 75 ఏళ్లలోపు క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 13 జిల్లాల నుంచి 150 మంది పోటీలకు హాజరయ్యారు. పురుషులు, మహిళలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికిలో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ కడప జిల్లా కార్యదర్శి జిలాని బాషా, చిత్తూరు జిల్లా కార్యదర్శి రామకృష్ణయ్య, అనంతపురం జిల్లా కార్యదర్శి మహ్మద్ షఫీ, రెఫరీ సంపత్‌రావు, జార్జిక్లబ్ అధ్యక్షుడు బాలగంగిరెడ్డి, సూరిబాబు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి

మైదుకూరు : మైదుకూరు పట్టణం బద్వేలు రోడ్డులో ఉన్న బస్‌స్టాప్ సమీపంలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు గుర్తించారు. 108 అంబులెన్స్‌లో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇతని గురించి సామాజిక మాధ్యమాల్లో రావడంతో మండలంలోని గంజికుంట పంచాయతీకి చెందిన పలువురు ఈ యువకుడు గంజికుంట పంచాయతీలోని ఏకర్లపాలెంకు చెందిన కె.అనిల్‌గా గుర్తించారు. కొన్నాళ్లుగా తల్లితో కలిసి ఖాజీపేటలో నివాసం ఉంటున్నట్టు తెలిసింది. ఇతను ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

హోరాహోరీగా ఎస్‌పీఎల్

- సెమీఫైనల్‌కు చేరిన జట్లు
- నేడు ఫైనల్ మ్యాచ్‌లు

SPL SAKSHI PREMIER LEAGUE
SAKSHI
SAKSHI DIGITAL MEDIA GROUP


కేఎస్ఆర్ఎం మైదానంలో తలపడుతున్న ఎస్.కె.ఎస్.సి. నిర్మల కళాశాల జట్లు

కడప స్పోర్ట్స్ : సాక్షి ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ క్రికెట్ మ్యాచ్‌లు తుదిదశకు చేరుకున్నాయి. గురువారం నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి. బ్యాట్స్‌మెన్ సిక్సర్‌లు, ఫోర్లతో చెలరేగగా, ప్రత్యర్థి జట్టను కట్టడి చేయడంలో బౌలర్లు విజృంభించారు. మ్యాచ్‌లు ఆద్యంతం ఉత్కంఠగా సాగగా.. విజేతలుగా నిలిచిన జట్లు కేరింతలతో సందడి చేశారు.


51 పరుగులు చేసిన ఎస్.వి. డిగ్రీ కళాశాల బ్యాట్స్‌మన్ జయరాం


3 వికెట్లు తీసిన ఎస్.కె.ఎస్.సి. బౌలర్ శివకేశవ

రాణించిన 'రాచపూడి'

కేఎస్ఆర్ఎం మైదానంలో ఉదయం 9 గంటలకు నిర్వహించిన మ్యాచ్‌లో బద్వేలు, శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల, ఓబులవారిపల్లె శ్రీపాలకొండ్రాయ డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పాలకొండ్రాయ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది.తొలుత బ్యాటింగ్‌కు దిగిన రాచపూడి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 89 పరుగులు చేసింది. జట్టులోని మహమ్మద్ వరీష్ 23 పరుగులు చేశాడు. పాలకొండ్రాయ బౌలర్ మనోజ్‌కుమార్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పాలకొండ్రాయ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. జట్టులోని అబ్బాస్ 33 పరుగులు చేశాడు. రాచపూడి బౌలర్ మహమ్మద్ వరీష్ 4 వికెట్లు తీశాడు. దీంతో రాచపూడి జట్టు 10 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది.

ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు విజయం

కేఓఆర్ఎం మైదానంలో ఉదయం 9 గంటలకు నిర్వహించిన మ్యాచ్‌లో కడప ఎస్.వి. డిగ్రీ కళాశాల, కడప గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గ్లోబల్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. జట్టులోని అశోక్‌కుమార్ 30 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్‌డ్రా అయింది. సూపర్ ఓవర్ ద్వారా ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది.

నేటి మ్యాచ్‌ల వివరాలు..

- సెమీఫైనల్-1 : కేఎస్ఆర్ఎం మైదానంలో ఉదయం 9 గంటలకు ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు – శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల, బద్వేలు.
- సెమీఫైనల్-2: కేఓఆర్ఎం మైదానంలో ఉదయం 9 గంటలకు కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల, కడప – ఎస్.వి. డిగ్రీ కళాశాల, కడప
- కేఎస్ఆర్ఎం మైదానంలో సీనియర్ విభాగం ఫైనల్ మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు
- కేఓఆర్ఎం మైదానంలో జూనియర్ విభాగం ఫైనల్ మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు ఎస్.ఆర్.ఐ.టి, ప్రొద్దుటూరు- ఆర్.కె.వ్యాలీ ట్రిపుల్ ఐటీ, ఇడుపులపాయ.


బ్యాట్స్‌మెన్ క్లీన్‌బౌల్డ్ అయిన దృశ్యం

సెమీఫైనల్లో ఎస్.కె.ఎస్.సి..


ప్రొద్దుటూరు ఎస్.కె.ఎస్.సి కళాశాల జట్టు

కేఎస్ఆర్ఎం మైదానంలో ఉదయం 11 గంటలకు నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ప్రొద్దుటూరు ఎస్.కె.ఎస్.సి. కళాశాల జట్టు, కడప నిర్మల ఫార్మసీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నిర్మల జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 43 పరుగులు చేసింది. జట్టులోని నాగార్జున 14 పరుగులు చేశాడు. ఎస్.కె.ఎస్.సి. జట్టు బౌలర్ శివకేశవ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్.కె.ఎస్.సి. జట్టు 4.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 44 పరుగులు చేసింది. జట్టులోని భానుప్రకాష్ 17 పరుగులు చేశాడు. దీంతో ఎస్.కె.ఎస్.సి. జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది.

రాచపూడి..


బద్వేలు రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల జట్టు

కేఎస్ఆర్ఎం మైదానంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో బద్వేలు శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ట్రిపుల్‌ఐటీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది. జట్టులోని మదన్ 10 పరుగులు చేశాడు. రాచపూడి బౌలర్ సందీప్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాచపూడి జట్టు 7.2 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 66 పరుగులు చేసింది. జట్టులోని శ్రీకర్ 23 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో రాచపూడి జట్టు 9 వికెట్ల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది.

కేఎస్ఆర్ఎం..


కడప కేఎస్ఆర్ఎం జట్టు

కేఓఆర్ఎం మైదానంలో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కడప కేఎస్ఆర్ఎం, కడప శ్రీహరి డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కేఎస్ఆర్ఎంఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన శ్రీహరి జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. జట్టులోని అమానుల్లాఖాన్ 30 పరుగులు చేశాడు. కేఎస్ఆర్ఎం బౌలర్ బలరాం 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కేఎస్ఆర్ఎం జట్టు 9 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. దీంతో కేఎస్ఆర్ఎం జట్టు 5 వికెట్లతో గెలుపొందిసెమీఫైనల్‌కు చేరింది.

ఎస్.వి. డిగ్రీ కళాశాల..


కడప ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు

మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించిన క్వార్టర్ ఫైనల్‌లో కడప ఎస్.వి. డిగ్రీ కళాశాల, కడప వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. జట్టులోని ఏడుకొండలు 32 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్.వి.డిగ్రీ కళాశాల జట్టు 5.2 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది. దీంతో ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొంది సెమీఫైనల్‌కు చేరింది.

జంటహత్యల కేసులో ముగ్గురు అరెస్ట్

పాత కక్షల నేపథ్యంలోనే హత్యలు


వివరాలను తెలుపుతున్న కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి


స్వాధీనం చేసుకున్న పిడిబాకులు, సెల్‌ఫోన్‌లు

కడప అర్బన్ : కడప రైల్వే స్టేషన్ రోడ్డులోని సాయిబాబా థియేటర్ ప్రక్కన రఘు బార్ అండ్ రెస్టారెంట్ ఆవరణలో రేవంత్, అతని స్నేహితుడు అభిలాష్‌లను దారుణంగా పిడిబాకులతో పొడిచి హత్యలకు పాల్పడిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం సాయంత్రం కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకరుల ఎదుట వారిని హాజరుపరిచారు. పాత కక్షలతోనే వీరిని హత్య చేశారని పోలీసుల దర్యాప్తులో తేలినట్లు కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి వెల్లడించారు.


ఈనెల 1వ తేదీ రాత్రి హతుడు, కడప రాజారెడ్డి వీధికి చెందిన పేటా రేవంత్(22), తన స్నేహితుడు చెరువు పల్లి అభిలాష్ అలియాస్ రాక్(24)తో కలిసి మద్యం తాగడానికి ఎస్ఆర్ సినిమా హాల్ (సాయిబాబా థియేటర్)పక్కన ఉన్న రఘు బార్ అండ్ రెస్టారెంట్‌లోకి వెళ్లారు.అదే బార్‌లోకి గతంలో స్నేహితుడిగా ఉండి మనస్పర్థలతో దూరమైన కడప నగరం ఎర్రముక్కపల్లి చింతలవీధికి చెందిన శ్రీరాముల గంగాధర్ కనిపించాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి వాగ్వివాదం జరిగింది. ఈక్రమంలోనే పాత కక్షలు మనసులో ఉంచుకున్న శ్రీరాముల గంగాధర్, ఎలాగైనా రేవంత్‌ను హత్య చేయాలని భావించాడు. సంఘటన స్థలానికి శ్రీరాముల గంగాధర్(29), అతని తమ్ముడు రాఘవ(22) స్నేహితుడు చింతకొమ్మదిన్నె మండలం ఇందిరానగర్‌కు చెందిన షేక్ ఖాదర్‌వల్లీ (26)లను పిలిపించాడు. బుధవారం రాత్రి సుమారు 8:40 గంటలకు రాఘవ, ఖాదర్, గంగాధర్‌లు వాదులాడగా ఘర్షణకు దారితీసింది. గంగాధర్, రాఘవలు పిడిబాకులతో, ఖాదర్ బండరాయితో రేవంత్‌పై దాడి చేశారు. విచక్షణా రహితంగా పొడిచి దారుణంగా హత్య చేశారు. తనకు ఎలాంటి ప్రమేయం లేకపోయినా స్నేహితుడిని రక్షించుకోవాలని, విడిపించే ప్రయత్నం చేసిన అభిలాష్‌ను కూడా కత్తితో మెడ సమీపంలో పొడివండతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనలో రేవంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. అభిలాష్ మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. నిందితులు ద్విచక్రవాహనంలో సంఘటన స్థలం నుంచి పరారయ్యారు. రేవంత్ తండ్రి పేటా నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

24 గంటల్లోనే నిందితుల అరెస్ట్..

ఈ సంఘటనపై జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి పర్యవేక్షణలో కడప వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ ఎస్.వి.నాగరాజు, ఎస్ఐ బి.పెద్ద ఓబన్నలు వారి సిబ్బందితో కలిసి రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు గంగాధర్, రాఘవ, ఖాదర్‌లను పబ్బాపురం గ్రామ సమీపంలోని కడప-బెంగుళూరు రైల్వే బ్రిడ్జి సమీపంలో అరెస్ట్ చేశారు. వారి నుంచి హత్యలకు ఉపయోగించిన రెండు పిడిబాకులు, ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. హత్యలు జరిగిన 24 గంటల్లోపే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు.

కడప- బెంగళూరు కొత్త అలైన్‌మెంట్‌ను ఆమోదించాలి

- గండికోటను టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దేందుకు సౌకర్యాలు కల్పించాలి
- కేంద్రమంత్రులకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వినతి


కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వని వైష్ణవ్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : కడప – బెంగుళూరు మధ్య మార్పు చేసిన కొత్త అలైన్‌మెంట్‌ను త్వరగా ఆమోదించాలని(అప్రూవ్), అలాగే గండికోట టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దేందుకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్, కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డిలను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. గురువారం ఢిల్లీలో వారిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన లేఖల ద్వారా తెలుపుతూ 2021 జూన్‌లో కడప – బెంగళూరు మధ్య మార్పు చేసిన కొత్త అలైన్‌మెంట్ కాపీని ఏపీ చీఫ్ సెక్రటరీ సమీర్ శర్మ ద్వారా రైల్వే బోర్డు చైర్మన్ త్రిపాఠి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వం సిఫార్సు చేసిన ఆ కాపీని కూడా ఈ వినతికి జత చేసినట్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గతంలో ఉన్న ఒరిజనల్ అలైన్‌మెంట్‌తో ఎక్కువ దూరం, రెండు రాష్ట్రాల మధ్య భూసేకరణ సమస్యకు ఎక్కువ కాలం పడుతుందన్నారు. మార్పు చేసిన ఈ కొత్త లైన్ ద్వారా తక్కువ దూరం తక్కువ ఖర్చుతో పూర్తి చేయవచ్చునని.. దీన్ని త్వరగా ఆమోదించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్‌ను కోరారు. అలాగే ఎంపీ కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని ఢిల్లీలో కలిసి గండికోట చారిత్రక ప్రాముఖ్యతను వివరిస్తూనే.. గండికోటను టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందిస్తూ ''స్వదేశీ దర్శన్'' అనే పథకం ద్వారా రూ.70నుంచి 80కోట్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. దాల్మియా సిమెంటు కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి సీఎస్ఆర్ ద్వారా మరికొంత నిధులు దీనికే కేటాయిస్తామని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి సిద్ధవటం కోట ప్రాముఖ్యతను ఎంపీ తన లేఖ ద్వారా వివరించారు. ఇటీవల భారీ వర్షాల సమయంలో సిద్ధవటం కోటలోని పురాతన స్మారక చిహ్నాలు, ప్రహారీ గోడలు చాలా వరకు దెబ్బతిన్నాయని తెలియజేశారు. పురాతన స్మారక చిహ్నాల పరిరక్షణ కోసం, ప్రహారీల పునరుద్ధరణ కోసం తక్షణం చర్యలు తీసుకోవాలని.. తద్వారా సిద్ధవటం కోట యొక్క చారిత్రక ప్రాముఖ్యతను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు సహకరించాలని ఎంపీ లేఖ ద్వారా కేంద్ర మంత్రిని కోరారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పేర్కొన్నారు. గురువారం కడపలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బడ్జెట్ బాగాలేదని పేపర్ స్టేట్‌మెంట్లకు పరిమితం కాకుండా కేంద్రంపై పోరాడాలన్నారు. పవన్ కళ్యాణ్ రాష్ట్రానికి ఏమి సాధించాలని రాజకీయాల్లోకి వచ్చాడో తెలియడం లేదన్నారు. అనంతరం చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం అనే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, జిల్లా కో–ఆర్డినేటర్ హరి ప్రసాద్, నాయకులు ప్రభాకర్, నజీర్ అహ్మద్, బండి జకరయ్య, జోడు నాగరాజు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని కొత్తపల్లె క్రాస్ సమీపంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. మృతుడు ఒంటిపై వేసుకున్న దుస్తులకు పెయింట్ మరకలు ఉన్నాయని, అతనికి సుమారు 45 ఏళ్లు ఉంటాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

లేబర్ కమిషనర్ పేరుతో మోసం

వైఎస్సార్ జిల్లాకు చెందిన నిందితుడి అరెస్ట్

నల్లగొండ క్రైం: లేబర్ కమిషనర్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న నేరగాడిని నల్లగొండ టూటౌన్ పోలీస్‌లు గురువారం అరెస్టు చేశారు. ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైఎస్సార్ కడప జిల్లా బి. కోడూరు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన బిల్ల నాగేశ్వర్‌రావు బీకాం వరకు చదివాడు. గతంలో అతడు నల్లగొండలోని ఓ ఎరువుల దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేశాడు. అదేవిధంగా స్థానికంగా బత్తాయి, నిమ్మ తోటల్లో మొక్కలను కటింగ్ చేసే పని కూడా చేశాడు. ఆ సమయంలో ఇక్కడి సెల్‌ఫోన్ దుకాణాదారుల ఫోన్ నంబర్లు సేకరించి, సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో ఆయా షాపుల నిర్వాహకులకు ఫోన్ చేసి తాను లేబర్ కమిషనర్‌ను అని.. షాపులకు లైసెన్స్ లేకుండా ఎలా నడుపుతున్నారని బెదిరించాడు. మొదటిసారి తప్పుగా భావించి రూ.600 జరిమానా వేస్తున్నానని, మరోసారి రిపీట్ అయితే రూ.20వేలు జరిమానా విధిస్తా అని ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేశాడు. వాట్సాప్‌లో లేబర్ సర్టిఫికెట్ పెడుతున్నా.. దానిని షాపులో పెట్టుకోండి అంటూ కొందరు మొబైల్ షాపుల యజమానులకు చెప్పాడు. మరికొందరికి ఆఫీసుకు వచ్చి లేబర్ సర్టిఫికెట్ తీసుకోవాలని చెప్పడంతో వారు లేబర్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లగా సంబంధిత అధికారులు తమకేం తెలియదని చెప్పారు. సహాయ లేబర్ కమిషనర్ మాధవరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు బిల్ల నాగేశ్వర్‌రావును గురువారం కడపలో అరెస్ట్ చేసి నల్లగొండకు తీసుకొచ్చి రిమాండ్ చేశారు. నిందితుడిని పట్టుకోవడంలో సహకరించిన పోలీసు కానిస్టేబుళ్లు శంకర్, బాలకోటి, నర్సింహారావు ఎస్సై అభినందించారు.

మెజారిటీ ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలించని బడ్జెట్

శాసనమండలి సభ్యులు సి. రామచంద్రయ్య



కడప కార్పొరేషన్ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలాసీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పూర్తి నిరాశాజకంగా ఉందని శాసన మండలి సభ్యులు సి. రామచంద్రయ్య అన్నారు. గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. దేశ జనాభాలో అత్యధికంగా ఉన్న రైతాంగం, గ్రామీణ యువతను ఈ బడ్జెట్ నిరుత్సాహపరిచేదిగా ఉందన్నారు. రెండేళ్లపాటు దేశంలో సాగిన కోవిడ్ తీవ్రత సమయంలో అన్ని రంగాలు కుదేలైనప్పటికీ దేశ ప్రజలకు ఆహారాన్ని అందించి ఆదుకున్నది వ్యవసాయరంగమేనన్నారు. అంతటి ప్రాధాన్యత ఉన్న వ్యవసాయ రంగానికి ఈ బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదన్నారు. పీఎం కిసాన్ నిధుల్లో, ఎరువుల సబ్సిడీల్లో రూ.50వేల కోట్ల మేర కోత విధించారన్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు గత ఏడాది రూ.9వేల కోట్లు కేటాయించగా, పత్తి రైతులను వంచించే విధంగా ఈ సారి సీసీఐకు ఎటువంటి నిధులు కేటాయించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఆశ్రిత కార్పొరేట్ మిత్రులకు, కోటీశ్వరులకు మేలు చేయడానికి ఆదాయపన్ను రాయితీలను ఈ బడ్జెట్లో పెంచారన్నారు. ఈ బడ్జెట్ ద్వారా సంపన్నులకు మరిన్ని రాయితీలు కల్పించి పేదలకు మొండిచేయి చూపడం క్షంతవ్యం కాదన్నారు. ఆదాయపన్ను పరిమితిని రూ.7లక్షలకు పెంచడం ద్వారా మధ్య తరగతికి ఊరట కల్పించామని చెప్పుకోవడం అర్థం లేదన్నారు.

భానుకోట క్షేత్రంలో నేడు నూతన ఆలయాల ప్రారంభం

- పలువురు ప్రముఖుల రాక
- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ అన్బురాజన్


భానుకోట క్షేత్రంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్, తదితరులు

సింహాద్రిపురం : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీభానుకోటేశ్వరస్వామి క్షేత్రం ప్రారంభానికి సిద్ధమైంది. రూ.4కోట్ల తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో నూతన ఆలయాలు నిర్మించారు. వీటిని శుక్రవారం ప్రారంభించనున్నారు.ఇక్కడ నిర్మించిన శివాలయ ప్రారంభోత్సవానికి ఏపీ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి, ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు హాజరు కానున్నారు.ఈనేపథ్యంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, జేసీ సాయికాంత్‌వర్మ, ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశు ఏర్పాట్లను పరిశీలించారు.ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో భానుకోట క్షేత్రాన్ని నూతన హంగులతో నిర్మించినట్లు గ్రామ సర్పంచ్ మహేశ్వర రెడ్డి, దేవాదాయ శాఖ సహాయక కమిషనర్ శంకర బాలాజీ, ఆలయ కార్య నిర్వాహణాధికారి విశ్వనాథ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించారు.

అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలి:ఎస్పీ

ముద్దనూరు : స్థానిక అప్ గ్రేడ్ పోలీసుస్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దొంగతనాలను అరికట్టేటందుకు గస్తీ పెంచాలన్నారు. దిశ యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని,స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు పెంచాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.